సిద్ధార్థుడు

భూపాల్

పొద్దంతా ఎండ. బండలు కాగి తాకితే చుర్రుమంటున్నాయి. ఆ బండల నిండా అక్షరాలు. నల్ల బండల మీద ఏదో ఆకు రసంతో, తెల్ల బండల మీద బొగ్గుతో 'అ' నుండి 'హ' వరకు అక్షరాలు. నక్కల గుట్టమీద పుట్టి ఈ మెనుగోన్ రాళ్ళ గడ్డ కంచెగుండా పారే ఓడిక. ఓడిక ఎప్పుడో ఎండిపోయింది; నీటి వాలులావున్న ఇసిక మీద అన్నీ అక్షరాలే-అవి 'అ' నుండి 'హ' వరకే.

ప్రకృతి సెగలు కక్కుతోంది. వడగాలి. భరణికార్తెలో బండలు పగిలే ఎండలు. నవనీత్ రెడ్డి మనసు నిండా ఆ కంచెలో వెన్నెల విరపూసినట్టుంది. అతని వయస్సు పది దాటి వుండదు. ఎండని ఏమాత్రం లెక్క చేయక చాలా రోజుల తర్వాత తన మిత్రుడు పశువుల గాసే యాదగిరిని చూస్తాననే సంతోషంతో ఆ ప్రాంతమంతా వెదుకుతున్నాడు. ముఖంలో గిరిని చూడాలన్న ఆతృత, మాట్లాడాలన్న కుతూహలం. పెద్దగుండు మీదికి ఎక్కి, కళ్ళు విశాలం చేసుకుని దూర దూరంగా చూపుల్ని సాగదీస్తూ 'గిరీ గిరీ' అని గట్టిగా పిలుస్తున్నాడు.

'మే' నెల మొదటి రోజులు. ఐదు గంటలకే వచ్చిన ఆ ఊరి పెద్ద పటేలు వీరభద్రారెడ్డి అల్లుని మారుతీ కారులో నుండి దిగాడు నవనీత్. ఒక్క నిముషంలో ఇంట్లో అందర్నీ చూసి 'హలో గ్రాండ్ పా', 'హలో గ్రాండ్ మా', 'హలో ఆంటీ' అంటూ కనిపించినోళ్ళను పలకరించి తన మిత్రుడు గిరిని కలుసుకోను ఒక్క పరుగున కంచెకు వచ్చాడు.

తెనుగోళ్ళ అంజయ్య కొడుకు గిరి. తండ్రీ కొడుకులిద్దరూ పెద్ద పటేలు జీతగాళ్ళే. ఈ పటేలు దగ్గరే అంజయ్య పదిహేను ఎండాకాలాలను నుండించాడు.

తల్లిదండ్రులతో పట్నంలో వుండే నవనీత్ ఈ ఊరికి పండుగలకూ, పబ్బాలకొచ్చినా, ఇలా సెలవల్లో వచ్చినా గిరితో కలిసే తిరుగుతాడు. వచ్చిన మరుక్షణం నుంచి గిరి లేకుంటే ఎటూ తోచదు.

పట్నం దుస్తులు, ఫ్యాషన్లు, కొత్త ఆట వస్తువులు చూడాలని, ఇంగ్లీషు, హిందీ మాటలు వింటూ విమానం, రైలుబండి, సినిమాల కథల కోసం గిరి చెవి కోసుకుంటే- ఇక ఊరిలో గిరే తోడు కనుక చెట్టు గుట్టల వెంబడి, చెరువు బావు లెంబడి తిరిగి గిరి చెప్పే పక్షుల, జంతువుల కథలు వింటూ పచ్చి కందికాయ, సెపరికాయ, ముంజలు, ఏ కాలానికి అవి తింటూ వున్నవాళ్ళు రోజులు హాయిగా వుండొచ్చునని నవనీత్ ఆశ. అందుకే తండ్రి వరదారెడ్డి ఎటూ వెళ్ళొద్దని మందలిస్తున్నా వినక కళ్ళు కప్పి దొంగచాటుగా ఈ మెనుగోన్ రాళ్ళలోకి పరుగెత్తుకొచ్చి గిరిని పిలుస్తూ వెదుకుతు న్నాడు. ఆ బండల మీద అక్షరాలన్నీ గిరి రాసినవేనని ఇతనికి తెలుసు.



రివ్వున వీస్తూ దుమ్మంత దోపుకొస్తున్న వేడిగాలి. గాలి వేగానికి పడపోగంనేమోనని ప్యాంటు కొంచెం బిగువుగున్నా కష్టపడి ఆ గుండు మీద అట్లే కూర్చున్నాడు నవనీత్. దూరంగా పశువులు కనిపిస్తున్నాయి. మనిషి జాడే లేదు. ఆ సమయంలో నవనీత్‌కి ఎదురుగా గాకుండా వెనక నుండి ని మాత్రం అలికిడి లేకుండా దగ్గరగా వచ్చాడు గిరి. కళ్ళు మూద్దామనుకున్నాడు. కాని నవనీత్ తెల్లని పూల పూల షర్టు నలిగి నల్లగౌతుందని ఐనా ఇంత చనువు ఇస్తాడో లేదోనని గట్టిగా "ఎప్పుడొచ్చినవ్ పటేలా?" అని అడిగాడు.

ఎటో చూస్తున్న వాడల్లా ఒక్కసారే చెవి దగ్గర వినిపించిన శబ్దానికి ఉలిక్కిపడి "అబ్బ, ఎంత భయపెట్టినవ్‌రా!" అని తల తడుము కొని, తన వీపుతానే నరుముకొని "గంట నుండి పిలుస్తున్న. పసుల విడిచి పెట్టి ఏడికి పోయినవ్?" అడిగాడు నవనీత్ గిరి ఆకారం చూస్తూ.

చూపులెంత సూటిలో ఆ గొంతు నుండి మాట అంతె గట్టిది. నవ్వు పుల్వె పూస్తుంటే ఆ పలువరుస తెల్లగా మెరుస్తుంది. ఆ జుత్తుకు నూనె ఎప్పుడూ రాసి వుండదు. చీకి పారేసిన మామిడి పీచు లాగుంది. చెమటతో తడిసిన ముఖమంతా జిడ్డు కారుతోంది. భుజమ్మీద చినిగిన జాకీ కమీజు ఎవ్వరు దానమిచ్చిందో మోకాళ్ళ వరకుంది. అసలు చెడ్డీ లేదేమో అనుకున్నాడు నవనీత్. కాని చెడ్డీ కింది పట్టీ చిరిగి నల్లగా వేళ్ళాడుతోంది. కాళ్లకు టైరు చెప్పులు. ఒక చెప్పు వుంగటం తెగి వుంది. దానికి ఈత ఆకులు నమిలి తాడులా పేని ముడి వేశాడు.

"ఈ బండల మీదంత నువ్వే రాసినవ్ గదర? నీ రాతకు ఈ బండలైనందుకు సరిపోతున్నయ్. ఇవ్వే నోట్‌బుక్స్ ఐతే ఓ

లారీ నిండ గావాలె. ఎప్పుడూ ఎందుకింత పిచ్చి రాతలు? రాసిందే రాస్తవ్?"

"మీ తాత దెగ్గర జీతం కుదురక మొదాలు నేను నేర్చిన సదువు ఇంతవరకే పటేలా. అది మర్చిపోఒద్దని ఎప్పుడూ రాస్తుంట. ఎన్నో ఏండ్ల సంది రాస్తున్న, వాన గొడితె ఈ రాసిందంత పోతది. మల్ల రాస్త."

"గిరీ నీకేమొ సదువు కొనాలనుంటది. నాకేమొ నీ లెక్క ఆడుకోవాలనుంటది. సదుకునేది సావా కష్టం. సారు కొడ్తుంటడు. నిన్ను సదువుల పెడితే మల్ల నువ్వు ఈడికే ఉరికొస్తవు"

"ఈ పసుల గాసుడు ఆటలా పటేలా? ఇది జీతముండుడు. మాకు పైసల్లేవు గని నీ లెక్క సదువు కొమ్మంటె బాగా సదువు కుంటుంటి. ఇగ ఎట్లైన నీ దసర దీపాలికి లెక్కలు జేస్తడట పెద్ద పటేలు. మా అప్పు దీర్తది. మాకున్న ఎకరం శెల్క మీద బ్యాంకు కెల్ల లోను దీస్తడంట మా అయ్య. మా భూమి మేమే దున్నుకుంటం. అప్పుడు నేనిగ సాల్లెకు పోత"

"అరే! నువ్వు రాసుకుంటందుకు పల్క దెచ్చిన. నోట్ బుక్, పెన్సిల్, మా చిన్న చెల్లె సదివిన తెలుగు పుస్తకం గూడ దెచ్చిన. రేపు నీ కిస్త"

గిరికి ఎంతో సంతోషమైంది. కండ్లు మెరిశాయి. "నెల రోజులు నీకు తాతీళ్ళు గద. పోయిన కారు లెక్క ముర్గశిల కార్తె వరకుంటవు గద? నాకు సదువు జెప్తవా మల్ల?" అని అడిగాడు.

నవనీత్ ఎటు వైపో చూస్తూ సరే అన్నట్టు తల ఊపాడు. సాయంత్రం ఎండ కొండ దిగిపోయింది. పశువులు ఒక్కొక్కటిగా దక్షిణం వైపు ఊరి చివరి నున్న బావి దిక్కుగా నడక సాగిస్తున్నాయి. మందలో వున్న కోల్లేగ ఒకటి అన్నిటితో కాకుండ తూర్పు దిక్కు ముఖం పెట్టి చెవులు నిక్కించి నాల్గు గజాలు నడిచింది. అది గమనించిన గిరి "ఏయ్... భీమ భీమ... ఎక్కడమ్మా?" అని మందలించాడు. ఆ లేగ టక్కున దిశ మార్చి మందలో కలిసింది. అది చూసిన నవనీత్‌కి ఎంతో ఆశ్చర్యం, సంబరం అనిపించింది.

"అబ్బ! నీ మాట ఇంటినే ఎంత భయుంరా?" అన్నాడు.

"అవు పటేలా! మొదాలు అది మాట ఇనకపోతుండె. శెర్వాకం సన్న జేస్తుండె. ఒక సారి మంచి ఆయిలిబర్గె తీస్కొని సెప్పిన మాట ఇనవా బిడ్డా అని తోక పట్కొని ఈవు మీద వున్నట్టు సప్పరిచ్చిన 'ఇంటవా' 'ఇంటవా' అని తిట్టుకుంట. సగం కంచె నిల్ల ఉర్కి నా తోక నిడువలే. అగో నప్పటి సంది నా మాట ఇంటే గజ్జున ఒణ్కుతది. అది శాన మంచిది పటేలా. జెర మెడ కింద దువ్వితే సాలు నన్ను పానం చేస్కుంట నా భుజమంతా నాకుతది."

"ఇవిటె కన్నిటికి పేర్లున్నయారా?"

"ఆ. అన్నిట్కి పెట్న. ఆ మక్క పెయ్య లేదు అది లచ్చులు.. దాని పక్క కున్నదేమొ లచ్చిమి. ఆ బట్ట కోడె పేరు అర్జున, ముంగట పొయ్యేదాని పేరు అంజన. ఇట్ల అన్నిటికున్నయి. పిలుస్తె పలుకుతయి"

నవనీత్‌కి నవ్వు ఆగలేదు. "పిలిస్తే నోరు లేనివెట్ల పల్కుతయిరా! పిచ్చోడ" అన్నాడు.

అవి పలుకుతాయన్న విషయం ఎట్లా అర్థం చేయించాలో గిరికి తెలియలేదు, "అవు పటేలా" అని మాత్రం అన్నాడు. ఇద్దరూ పశువుల వెనకాల నడుస్తూ కొంత దూరం వెళ్ళారు. కంచె దాటి సెలకల నడుమున్న డొంక దగ్గరకి వెళ్ళగానే అక్కడున్న మామిడి చెట్టు నవనీత్ కంటపడ్డది. 'అరె మామిడి కాయలు' అంటూ అటుగా పరిగెత్తాడు నవనీత్.

చెలక అంచునున్న గెట్టు మీద చిన్న చిన్న పలుగు రాళ్ళు కనిపిస్తే అతి కష్టమ్మీద రెండు చేతుల్లో ఎనిమిది రాళ్ళను తీసుకున్నాడు. చెట్టు కిందకి వెళ్ళి ఒక చోట వాటిని కుప్పలా వుంచి ఒక్కొక్కటిగా చెట్టు పైకి విసరసాగాడు. ఇదంతా చూస్తున్న గిరి మెల్లగా నవనీత్‌ని చేరి "ఇంకెన్ని రాళ్ళు గొడ్తవు పటేలా? చెట్టు మీద నిటారు కొమ్మ దాక చెప్పు. ఏ కాయ గావాలె? నేను కొట్టిస్త. మీ తాత గిట్ల సూస్తెనెతె నువ్వె కొట్టుమన్నట్టు చెప్పాలె మల్ల" అన్నాడు.

నవనీత్ 'సరే' అన్నాడు కాయను చూపిస్తూ.

పశువుల డొంక వెంబడి నేరుగా వెలుతున్నాయి. గిరి ఒకే ఒక చిన్న రాయి తీసుకొని గురి చూసి విసిరాడు. క్షణంలో నవనీత్ చూపించిన కాయ టక్కున తెగి క్రింద పడ్డది. నవనీత్ ఎగిరి గంతేశాడు. మరో కాయ చూపిస్తే దాన్నీ ఒకే దెబ్బతో రాల్చాడు. నమ్మశక్యం కాని గిరి ప్రావీణ్యానికి నవనీత్ విస్తుపోయాడు. మరోటి తన పెద్ద చెల్లి కోసమనీ మూడింటిలో రెంటిని జేబుల్లో కుక్కేసి ఒక దాన్ని అట్టే కొరికి తినబోయాడు.

"ఉండు పటేలా. దానికి జీడి కారుతుంది. ఆ సొన పెయ్యి మీద పడ్డా, మూతికి అంటినా పుండ్లైతాయి" అని నవనీత్ చేత నున్న కాయ తీసుకొని చెట్టుకాండానికి కాయ ముండి కారుతున్న జీడినంతా తుడ్చి ఇచ్చి పశువుల వైపు చూశాడు. అవి ఇంచుమించు బావి దగ్గరకి చేరుకున్నాయి. అవి గాడిలో నీళ్ళు తాగుతుంటే గిరి సన్నని ఈల వేస్తూ 'త్రుష్.. ఛో... ఛో' అంటూ అన్నిటి ఎడమ డొక్కలు పరీక్షించసాగాడు. చెట్టు గుట్టెంబడి తిరిగి ఏగాకు, జియ్యాకు, జానాకు ఎంత ఇరిసి ఏసినా ఇయ్యాల వాటి కడుపులు నిండలేదని అనుమానపడ్డాడు. అందరి బావుల వద్ద వరిగడ్డి ఐపోయినా పెద్ద పటేలు దగ్గర చాలా వుంది. నీళ్ళు దాపి దొడ్లో కట్టినాక 'ఇయ్యాల రెండు బిగిల గడ్డి ఎక్కువెయ్య'మని తన అయ్యకు చెప్పా

ఇంకా సమయముంది!

యుగాల నీలినీడల్లోంచి
అక్షరాలకొక్కేలు విసిరి నేకున రేకుల్ని లాక్కొచ్చా
ఎవరికీ పేచీలేదు

నా ప్రపంచపు చీకటి మరకల్ని తుడవడానికి
భావాల ఖజానా విప్పి ప్రశ్నల శిలువ ఎత్తాను
నేనో కుట్రదారును

నాగరికత రక్త కీకారణ్యాలకీ
ప్రకృతి మహాగ్ని శిఖరాలకీ తేడా తెలిసి క్షణాన
నేను ప్రశ్నగా ప్రత్యక్షమవుతా
ద్రవ సమాజాన్ని అరలరలగా ఖండించ జూస్తున్నప్పుడు
అడుగు ముందుకేస్తూ ఆలోచన్ని వీపులో సమాధి చేస్తున్నప్పుడు
నే ప్రశ్నగా ప్రత్యక్షమవుతా
నడిచే నడకనే కాదు - దారినీ ప్రశ్నిస్తా

జ్ఞాన ఫలాన్ని కొల్లగొట్టేవాడు ప్రశ్నని పాతేస్తాడు
నోటికి బెండేజీలు వేస్తాడు
ప్రశ్నని బంధించే హీన చరితుడు
ఆ రెండక్షరాల పదాన్ని ఎదుర్కోలేని వాడు
తత్త్వవేత్తల పటాలపై పేరిన బూజునీ దులపలేడు
ప్రపంచ జ్ఞానాన్నే... గమనాన్ని బొటన వేలికింద
అదుముతూ అదుముతూ బలహీనపడి-
ప్రశ్నించిన నేను పక్కదారి పడుతున్నానని
తమ్ముతాను ఓదార్చుకుంటాడు

సంక్షిప్త వాస్తవికతలో ఏ జవాబూ పరిపూర్ణ వాస్తవంకాదు
న్యూరాన్ - మైక్రోచిప్ - మారోచిప్...
విశ్వాంతరాళాల సవ్యభిక్రమచరిత్ర మీద
నిలబడ్డ నిలువెత్తు ప్రశ్నల్ని గుర్తించక
పాత జవాబుల రెడీమేడ్ కొత్తగెడు పతితా!
"న్యూరోచిప్ నీడ్స్ ఏ మైక్రోస్కోప్"
మైక్రోస్కోపుకి వేలాడ్డం పరిశోధన కాదు
లెన్స్ కింది ప్రశ్నల తప్పుకి కంటిని శిక్షించకు
తప్పదు
చరిత్ర నిర్మించేవాడు
ఒకే ప్రశ్నకి వందల జవాబులై విస్తరించాలి
జవాబులు ప్రశ్నలకి పురిటి గదులు
అర్థవంతమైన విజ్ఞానం ఒక ప్రశ్నలో విడిపోదు
తుపాకీ శక్తి విజ్ఞానం కాదు
దానికో టార్గెట్ కావాలి
టార్గెట్‌కీ తనకీ మధ్య దూరం కావాలి
తన బలమెంతో తెలియాలి - ఎదిటి శక్తిని అంచనా వేయాలి
లేదా
ఓటమికి మరో పది ఓటములు కాస్తాయి
అవసరమైతే మైక్రోస్కోపు మారుద్దాం

ప్రశ్న ఒక సమాధానాల పంట చేను
శక్తి తుపాకీ కావచ్చు
శక్తి మానవసారపు అనుభవ పోరాటదశలు కావచ్చు
ఏది కావాలో ఎప్పుడు కావాలో గుర్తించడమే జవాబు
మానవ భూగోళశాస్త్ర నిత్య పఠనంలో
జవాబుని గుర్తించడం కష్టమే
ఆలస్యం కాలేదింకా
మరోసారి ప్రశ్నించుకోడానికి!

-జయధీర్ తిరుమలరావు

అనుకున్నాడు. ఇంతలో ఏదో జ్ఞాపకమొచ్చి 'ఒక్క నిముషంలొస్తా'నని నవనీత్‌కి చెప్పి గడ్డివాముల వైపు పరుగుతీశాడు. నవనీత్ చూస్తుండగానే ఒక మూలలో మక్కేసిన ఈత పళ్ళు తెచ్చి అతని దోసిలి నిండా పోశాడు. తర్వాత పసుల్ని దొడ్లో కట్టి పంగడ పెట్టి వెనక్కి తిరగ్గానే బాయికి పడమటి వైపు వీరభద్రారెడ్డి అల్లునికి టమాట తోట చూపిస్తూ కనిపించాడు.



"అగో మీ నాయిన, పెద్ద పటేలు తోట తిరిగి చూస్తున్రు. నా ఎంట నువ్వున్నట్టు చూస్తె నిన్నూ నన్నూ తిడ్తడు మీ నాయన. మెల్లగ ఈ కానుగు చెట్ల ఎనక్కెల్లి ఇంటి కురుకు" నవనీత్‌కి చెప్పాడు గిరి.

తండ్రిని చూడగానే నవనీత్ కాళ్ళు వెనక్కి ఆగాయి. అదీ గాక చేతి నిండా ఈతపండ్లు. ఇంకేం గిరి చెప్పినట్టే మెల్లగా దాటుకున్నాడు.

వేసవి సెలవల్లో పట్నం వేడి భరించలేక పిల్లలతో తల్లిగారింటికొచ్చింది వనజమ్మ నవనీత్ తల్లి. భార్యా పిల్లల్ని దిగబెట్టి వెళ్ళడానికి వచ్చాడు వరదా రెడ్డి. సిటీలో వుంటే పిల్లలు బాగుంటారనీ, ఊరికొస్తే పూర్తిగా చెడిపోతారని, భార్యం ఏం పట్టించుకోదనీ అతని భయం. ఊరికొచ్చి కింది కులస్తులతో, పని బాటలోల్లతో తిరిగి చెడ్డ మాటలు, చెడు అలవాట్లు, పోకిరీ పనులు, రోగాలు తెచ్చుకోవద్దనీ, క్రమశిక్షణ దాటొద్దనీ పిల్లలకు అతను ఎన్నిసార్లు చెప్పినా వినరు. భార్య 'సరే, జాగ్రత్తగా చూసుకుంటా' అంటుంది కాని అతను పట్నం వెళ్ళిపోగానే చెప్పినవన్నీ మర్చిపోతుంది, పొద్దాక పిల్లల గోల భరించడం కష్టమని.

ఆ రోజు రాత్రి భోజనాలు కాకముందు తల్లి దగ్గరికి పరిగెత్తుకొచ్చాడు నవనీత్. "అమ్మా! గిరిగాడి అయ్య కుందేళ్ళు పట్టిండట. దాన్ని ఆళ్ళు కోసుక తింటరట. అది నాకు గావాలె. సాదుకుంట. దబ్బున ఎవర్నన్న ఆల్లింటికి తోలిచ్చి తీస్కరమ్మను" ఇంచుమించు ఏడుస్తూనే చెప్పాడు.

తల్లి 'తాత నడుగు'మంది. తండ్రి "చూశావా! అప్పుడే వాడికి ఊరి సంగతులన్నీ తెలిశాయ్. కుందేలూ, కోడీ, కొంక, నక్కా అంటున్నాడు. చెట్టు గుట్టలెంబడి తిరిగి చెడిపోకుండా చూడు. మరోసారి చెపుతున్న ఆ జీతగాళ్ళతో అస్సలు తిరగనివ్వకు" అన్నాడు.

నాల్గు రోజులు కన్నేసి కుందేలు స్థావరం జాగ్రత్తగా కనిపెట్టాడు అంజయ్య. ఈ రోజు సాయంత్రం దొంక మూలకు, ఆయిలి చెట్ల నడుమ వల కట్టి జోపితే అది లేచి పరిగిడుతూవలలో చిక్కింది. కుందేలు కూర తినక సంవత్సరం దాటింది. ఇప్పుడు దీన్ని కోసుకు తిందామని జివ్వ గుంజుతున్నా, దాన్ని అమ్మితే ముప్పై రూపాయిలన్నా వస్తయని మరో దిక్కు అంజయ్య మనసు కొట్టుమిట్టాడుతుంది.

"కూర లేక సిన్నవోయినావయ్యా! నేనైతే ఒండిపెట్ట. దాన్నెవరికన్నా అమ్మేయ్. పోరగానికి లాగు లేదు" అంటుంది అంజయ్య పెళ్ళాం.

"అమ్మ చెప్పేదీ బాగానే వుంది. కాని 'కుందేలు కూర!' అయ్య చెప్పింది కూడ బాగానే వుంది. కత్తి మారమన్నదు గదా' అనుకుంటూ సానె మీద కత్తి మారుతున్నాడు గిరి. అప్పుడే పటేలు మరో జీతగాడు నర్సయ్య ఊడిపడి 'కల్లు తాగుమని పటేలు ఐదు రూపాయిలు పంపిండని' అని అంజయ్య చేతిలో పెట్టి గంప కింద దాచిన కుందేలు చెవులు పట్టుకొని తీసుకుని వెళ్ళిపోయాడు. గిరికి బాధ అనిపించినా వెళ్ళేది తన మిత్రుని ఇంటికే గదా అనుకొని సర్దుకున్నాడు.

మరునాడే పటేలింట్ల పిట్టగోడ పక్కన పిడుకల గూడు నానుకొని బొమ్మరిల్లు లాగా మట్టి గోడ పెట్టి నిలువెత్తు జాలి మట్టి దాంట్లో కుందేలునుంచారు. దాని ఆలనా పాలనా అంతా గిరి మీద వేశారు. ఉదయం, సాయంత్రం దాని గూడు శుభ్రం చేసి గడ్డి గరకా తెచ్చి వేయాలి. నీళ్ళు పెట్టాలి. నవనీత్‌కి, చెల్లెళ్ళకూ బలే సరదాగా వుంది. వరదారెడ్డి ఉదయం లేచి కుందేల్ని చూసి "మరెక్కడా వెళ్ళకండి. దీన్ని చూస్తూ ఇంట్లోనే ఆడుకోండి" అంటూ "అరే! గిరిగా! బాబును బయట ఎండలో తిప్పితివా ముందు నీ వీపు విమానం మోత మోగిస్త" అని గట్టిగా హెచ్చరించి పట్నం వెళ్ళిపోయాడు.

* * *

నెల రోజులు గడిచాయి. వరదారెడ్డి హెచ్చరిక గిరికీ, క్రమశిక్షణ పాఠం నవనీత్‌కి పట్టించే లేక ఇష్టం వచ్చినట్టు తిరిగారు. వరి మళ్ల కన్నాల్లో వుండే ఎండ్రకాయనైనా, గట్టున పుట్టలోకి పాకుతున్న పామునైనా లెక్కచేయక తేలిగ్గా పట్టి ఆడిస్తాడు గిరి. కోతి కొమ్మాడితే మిగతా పిల్లలకన్నా చలాకీగా ఆకాశ వీథుల్లో ఆడేస్తాడు. పరుగు పందాల్లో గాలి కన్నా వేగంగా, నీళ్లలో దూకితే చేపలకన్నా చమత్కారంగా... ఇదంతా చూసి గ్రామంలో గిరిని మించిన వీరుడే లేడని నిర్ణయించుకున్నాడు నవనీత్. ఐనా గిరి తన జీతగానితనానికి ఏ మాత్రం భంగం వాటిల్లకుండా పనులు చేస్తూ నవనీత్‌ని ఎంతో సంతోషపర్చాడి నెల రోజులు.

నవనీత్ ఈత నేర్వాలని తమా, తండ్రి కలిపి ఆయిదను లొట్టెలు తెచ్చి సమంగా కట్టకట్టి అతని వీపుకి నడుం భాగంలో బిగించి కట్టి పెద్ద బావిలో ఈదడం నేర్పించాడు. చేలలో కంచెల్లో ఇరికి పండ్లు, బుడ్డగోసి పండ్లూ మొదలు ఏ పండు దొరికినా తెచ్చి నవనీత్‌కి ఇచ్చాడు గిరి. కెక్కెర, గువ్వ, కంజు, చీమకోడి గుడ్లు ఏవిదొరికినా పెండలోనో, మర్రి ఆకు దొప్పలోనే కాల్చి పెట్టాడు. కుందేలుకు పప్పులు, లేక గరికే కాకుండా మైలు దూరమున్న ఎవరో ఒకరి బావి దగ్గర నుండి నాపన్ గడ్డి దొంగచాటుగా ఎత్తుకొచ్చి దానికేశాడు. కుందేలు బాగా బలిసి నిగనిగలాడుతోంది. ఈ కుందేలు జతకు మరొకటి దొరికితే బాగుండునని ఎంతో ప్రయత్నించాడు కాని దొరకలేదు. నవనీత్ ఒక్కడే కాక అతని చెల్లెళ్ళు కూడా కుందేలు మీద ఎంతో మమకారం పెంచుకున్నారు. ఎప్పుడూ దాని గూర్చే మాట్లాడుకుంటారు. ఎట్లా గుర్తుపట్టాడో కాని అది సొట్టతో వుందనీ, పిల్లలు చేస్తుందని చెప్పాడు గిరి. అప్పటి నుండి కుందేలు పిల్లల్ని చూడాలని, "బుల్లి పిల్లల్ని అది ఎప్పుడు పెడుతుందా" అని ఎదురుచూడసాగారు పిల్లలు. గిరిని ఎన్నో యక్ష ప్రశ్నలడిగారు. అన్నిటికీ ఏదో సమాధానం చెప్పడం అతనికి మామూలైపోయింది.

ఇంకా పది రోజుల్లో స్కూల్స్ ప్రారంభమౌతాయని జూన్ మొదటి వారంలో మృగశిర కార్తె ముందు రోజు తిరిగి ఊరికొచ్చాడు వరదారెడ్డి. పిల్లల్ని చూస్తే తాను పెట్టిన కండిషన్స్ ఏవీ పాటించినట్టు లేదనిపించింది. నవనీత్ కొంచెం నల్లబడ్డాడనీ, సలచబడ్డాడనీ తన మనసులో అనుకున్నాడు. ఆ గిరి గాడి స్నేహమే పాడు చేసిందని బాధ పడ్డాడు. ఎల్లుండి పట్నం బయలుదేరుదామనుకున్న నాడు అర్థమైంది పిల్లలు కుందేలుని విడిచేలా లేరని. వాళ్ళు తమతోనే దాన్ని తీసి కెళదామంటున్నారు.



ఎప్పటిలాగే చూడ్డానికి గిరిని కూడా తీసికెళదామంటు న్నారు. ఈ కుందేలు పీడ ఎలా వదిలించు కోవాలో అర్థం కాలేదు వరదా రెడ్డికి. ఆ రాత్రి దాన్ని తీసి బయట పడేశాడు. అది ఎటు వెళ్ళక ఉదయం వరకూ గోడల లోపలే వుంది. కుక్క దాన్ని ఏమీ అనలేదు. గిరి రాగానే చూసి 'అయ్యో బైటికెట్లొచ్చిందీ?' అని లోపలేశాడు. మరునాడు 'దాన్ని కోయించి తినేస్తే' ఆలోచించాడు వరదారెడ్డి. కాని పిల్లలు ఆ మాంసం తినరనిపించింది. మరో మార్గమని ఒక జీతగాన్ని పిలిచి 'దాన్ని తీసికెళ్ళిపో లేదా చంపి ఎక్కడైనా పారేయ్, కాదంటే ఎవరికైనా అమ్మేయ్'' మన్నాడు. ఆ జీతగాడు ''ఒద్దు పటేలా పిల్లలేడుస్తరు. నేను తీస్కపోతే యాదగిరిగాడు ఊకోడు. ఈ రాత్రికే నా ఇంటికి పంగలం పెడ్తడు'' అన్నాడు.

ఏమైతేనేం మరునాడు తెల్లారేసరికి కుందేలు తన గూడులోనే చచ్చిపడుంది. దాన్ని ముందు చూసింది గిరే. పిల్లలందరూ లేచారు. 'ఎట్లా చచ్చింది? ఏమైందని?'' గిరిని అడిగారు. గిరికి ఏమీ అర్థం కాలేదు. కుందేలు కళేబరాన్ని చేతుల్లోకి తీసుకొని ఏమైనా కరిచిందా? అని పరీక్షించాడు. ఏమీ కరిచినట్టు కనిపించలేదు.' నవనీత్ ఎంతో బాధపడ్డాడు. చెల్లెళ్ళు ఏడ్చారు.

''ముందుదాన్ని తిందామని అనుకున్న వాడు గిరే, దాన్ని పట్నం తీసికెళ్ళడం వానికే ఇష్టం లేక ఇలా చంపాడు. వాడు కాకుండా మరొకడు దాన్ని చేరే ధైర్యం చేయలేడని'' కొన్ని కారణాలు చూపాడు వరదారెడ్డి.

నవనీత్ తండ్రి మాటలు విని అనుమానంగా చూశాడు. చెల్లెల్లూ గిరి దిక్కు చూశారు. ''నేనెందుకు చంపుతా? నాకు తెల్వదు'' అన్నప్పటి గిరి కళ్ళు చెమ్మగిల్లి వున్నాయి. ఏ మాత్రం అతన్ని సందేహించ డానికి వాళ్ళ మనసులు ఒప్పలేదు. గిరి గుణం పెద్దలకన్నా వాళ్ళకు బాగా తెలుసు. మరి చంపిందెవరు? ఎవరికీ అంతుచిక్కలేదు.

''ఏంరా? ఇంకా నిలబడ్డావేం? దాన్ని తీసికెళ్ళి ఏం చేస్తావో చేసుకోపో! నడువ్ నా కళ్ళ ముందు వుండకు'' అన్నాడు వరదా రెడ్డి.

గిరి ఏం మాట్లాడక కుందేలు శవంతో బయటకి నడిచాడు.

తిండి కూడా తినక ఆ రోజంతా పశువుల వెనకాల ఏడుస్తూ తిరిగాడు గిరి. సాయంత్రం వరకూ ఎవ్వరితో మాట్లాడ లేదు. నెల రోజులుగా రోజూ కలిసే తన [illegible] యుడు ఈ రోజు దూరం నుండైనా [illegible]లేదు. ఎప్పుడూ ఇన్ని రోజులు లేని [illegible]తో వాళ్ళ మధ్య 'పటేలు, జీత [illegible] సంబంధం చాలా వరకు తగ్గి స్నేహం [illegible] తలిచాడు గిరి. మరి నవనీత్ [illegible] కెందుకు రాలేదో తెలియదు. తను [illegible] కాడు. అతను అనుమాని

చిత్రం: వెల్లటూరి పూర్ణానంద శర్మ.

పడుతున్నాడా? ఏమో చెప్పలేం!'' వాళ్ళ నాన్న నా మీద ఇంకా ఏమేమేం చేప్పాడో'' అనుకు న్నాడు.

చీకటి పడింది. ఆకాశం నిండా మేఘాలు. ఎంత ఎండలోనైనా తిరుగుతారు. పనులు చేసుకుంటారు జనం. కాని వాల్లు చినుకులు పడుతున్నాయంటే తడుస్తూ తిరగరు, పని చేయరు. వాన కుండపోతగా కుమ్మరిస్తే బాగుండుననీ, రేపే విత్తనాలు చల్లుకుందుమని ఎంతో ఆశతో మొగుల్ని చూసి సంతోషిస్తూ రైతులంతా ఇండ్లలోకి, గూళ్ళలోకి వెళ్ళిపోతున్నారు. కోళ్ళ గూళ్ళు సరి చేసి, లేగల పలుపులు బిగించి, పసుల దొడ్ల పలగాళ్ళు పెట్టి చూసి, తట్ట, పార తాళ్ళు అంబలి గంపలుఎక్కడివక్కడ భద్ర పరుస్తున్నారు. ఎక్కడో వాన భూమిని ముట్టింది. కమ్మని మట్టి వాసన జమ్మున కొడుతూ చల్లగాలి వీస్తుంది.

వీరభద్రారెడ్డి మిద్దె మీద తన కోసం పడక పరచి వున్న గదిలోకి దక్షిణం దిక్కున మెట్లు ఎక్కుతున్నాడు అల్లుడు వరదారెడ్డి. సెందలాడే పుష్టిగా భోంచేసి తాంబూలం బిగించి ఉత్సాహంగా ఆరుమెట్లు ఎక్కాడో లేదో గోడ అవతలి నుండి తూటా లాగా రివ్వున దూసుకొచ్చిన రాయి బలంగా తలకు తాకింది. అట్లే తల పట్టుకుని కూలబడి పోయాడు. తల బొల బొల నెత్తురు చిమ్మింది. అరిచిన అరుపుతో అందరూ నిముషంలో పరుగెత్తుకొచ్చారు. కందిళ్ళు, టార్చిలైట్లు, చీకటి నంతా వెలుగు చేసి వెదికాయి. ఆ రాయి ఎవ్వరు విసిరారో ఎవరికీ అంతుపట్టలేదు. చుట్టుపట్ల ఎవరూ లేరు. జీతగాళ్ళు అంజయ్య, నర్సయ్య తది తరులు అక్కడే వున్నారు. కొందరి అను మానం గిరి మీద వుంది. ఈ దెబ్బ గిరి కొట్టిందేనని నవనీత్ నిర్ధారణ చేసుకున్నాడు. అప్పుడే ఎవరితో అనలేదు. గిరి ఇంట్లో వున్నాడా అని ఇద్దరూ వెళ్లి చూశారు.

''పసులను ఇంకో పోరని తోని కొట్టి చ్చిండు. ఒక ఎద్దు ఆగమైందట. ఆడింక ఇంటికే రాలేదు. ఎక్కడెక్కడ తిరుగు తుండో ఏమొ. మొగులు అఖండమైంది. ఆవొచ్చేటట్టుంది'' అంది తల్లి.

ఇది జరిగిన గంట తర్వాత ఆ బంగ్లా ముందు నుండే ఎద్దును గొట్కొని గట్టిగా మందలిస్తూ అందరు చూస్తుండగానే బావి దిక్కుగా వెళ్ళాడు గిరి. 'ఇది గిరి చేసిన పనే' అని తాతగారికి చెప్ప ప్రయత్నం చేశాడు నవనీత్. తండ్రి పడుతున్న బాధ చూసి తాత ఆ మాట వినిపించుకోక ''ఈ దెబ్బ పిల్లలు కొట్టింది కాదు, ఎవరో పెద్దలే ఈ పని చేశారు'' అని అన్నాడు.



రాత్రికి రాత్రే వాల్లు కిలోమీటర్లు కారును పంపించి మంచి డాక్టరుని తీసుకు వచ్చి మందులూ, గాయానికి కుట్లూ, పట్టీ వేయించాడు. ఆ రాత్రంతా వీరభద్రారెడ్డికి నిద్ర లేదు. అవమానంతో కృంగిపోయాడు. 'ఈ ఊరికేదో మునలం పుట్టింది' అని మాత్రం మనసులో అనుకున్నాడు.

తెల్లవారింది. నవనీత్‌కి గిరి కనిపించినా పలకరించలేదు. చూసి కూడా చూడనట్టే ప్రవర్తించాడు. ఈ రోజే సాయంత్రం అందరూ పట్నం వెళ్ళిపోతున్నారని తెలి సింది. సాయంత్రం వరకు ఎట్లాగైనా ఏదో ఒక పక్షినన్నా పట్టి నవనీత్ కివ్వాలని, తన స్నేహం మర్చిపోడనీ అనుకున్నాడు గిరి. ఏ చెట్టు మీద ఏ పక్షి వాలుతుందో, దేని గూడు ఎక్కడుందో, ఏ వేళ్ళప్పుడు పక్షులు ఎక్క డుంటాయో అన్నీ తెలుసు. ఎంతో ప్రయత్నం చేసి వాల్లు చోట్ల ఉర్లు పన్ని ఎలాగైతేనేం మధ్యాహ్నం వరకే పావురాన్ని పట్టుకున్నాడు. సాయంత్రం వరకు దాన్ని జాగ్రత్తగా కాపాడాడు.

కారు సిద్ధమైంది. పెద్దలందరూ వన జమ్మ కుటుంబాన్ని సాగనంప వాకిట్లోకి వచ్చారు. ఆవకాయ పచ్చడి కొత్త జాడీలు, పిండి పదార్థాలతో కారు డిక్కీ నిండి పోయింది. రాత్రి తాకిన దెబ్బ నొప్పి ముది రింది. అప్పటి వరకూ పడుకున్న వరదారెడ్డి ఇక మెల్లగా లేచి కారు దగ్గరకి వచ్చి డ్రైవర్ సీట్లో కూర్చున్నాడు. వనజమ్మ, పిల్లలు వెనుక సీట్లలో కూర్చున్నారు. ఇక బయలు దేరే ముందు అందరికీ మళ్ళీ మళ్ళీ 'టాటా' చెప్పి కారు ముందు సీట్లో కూర్చు న్నాడు నవనీత్. గిరికి వెళుతున్నాననైనా చెప్పలేదు. ఐనా అప్పటివరకు పావురాన్ని ఒక చేత్తో వెనక దాచుకున్న గిరి కారు దగ్గరగా వచ్చి 'ఇగో ఇది నీకే' అంటూ పావురాన్ని అందించాడు.

వరదారెడ్డి గుడ్లురిమి చూస్తూ కొడుకు చేతిలో నుండి పావురాన్ని లాక్కున్నాడు. దాని మెడ పట్టి మూడు చుట్లు తిప్పి బయటికి విసిరి పారేస్తూ 'పో లంజా కొడకా' అన్నాడు కసిగా. పిల్లలంతా కళ్ళప్పగించి, ఆశ్చర్యంతో చూశారు. కారు స్టార్టయి వెళ్ళి పోతుంది.

గిరి కండ్లు ఎర్రబడ్డాయి. కోపం బుసలు కొట్టింది. తను ఏమీ చేయలేని స్థితి చుట్టూ పెద్దలు, పటేండ్లు. ఒక్కరూ కిక్కురు మనరైరి. మెల్లగా అడుగులు వేస్తూ నేలపై పడున్న పావురాన్ని చేతుల్లోకి తీసుకొని పరీ క్షించసాగాడు. రెక్కలు టప టప కొట్టుకొని చనిపోయిన పావురం మెడ ఎటు వేస్తే అటు వాలిపోతోంది. దాని కళ్ళ రెప్పలు పైకెత్తి చూశాడు. మళ్ళీ మూతలు పడ్డాయి. ఇక గిరి బోరున ఏడ్చాడు. నిమిషంలో దుఃఖాన్ని దిగమింగి లేచి నిలబడి కారు వెళుతున్న వైపు చూస్తూ కసిగా పండ్లు పటపట కొరికాడు.

◇